క్లుప్తంగా

ఒరిగిన విద్యుత్ స్తంభం



ఒరిగిన విద్యుత్ స్తంభం

ఎచ్చెర్ల: చిలకపాలెం సచివాలయం సమీపంలో పొందూరు వెళ్లే మార్గంలో విద్యుత్ స్తంభం ఒరిగిపోయి ప్రమాదకరంగా మారింది. స్తంభం ఒరిగిపోయి చాలారోజులైనప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు. పెద్ద గాలి వీస్తే మొత్తం పడిపోయేలా ఉందని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ ప్రభుత్వ కార్యాలయాలను కట్టడానికి చెట్లను తొలగించినప్పటికీ.. ఒరిగిపోయిన స్తంభాన్ని మాత్రం పట్టించుకోలేదని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైన స్పందించి స్తంభాన్ని సరిచేయాలని స్థానికులు కోరుతున్నారు.

అగ్నిప్రమాద బాధితులకు సామగ్రి పంపిణీ



బాధితులకు సామగ్రిని అందజేస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

జి.సిగడాం: జాడ గ్రామంలో ఈనెల 20వ తేదీన సంభవించిన అగ్నిప్రమాదంలో సర్వసం కోల్పోయిన బాధితులకు లోలుగు సుశీల మెమోరియల్ ఫౌండేషన్ అండగా నిలిచింది. బాధితులు చల్లా అప్పయ్యమ్మ, ఆదినారాయణ, పులపా నర్సింహులకు ఫౌండేషన్ ప్రతినిధులు వంజరాపు రామకృష్ణ, శ్యామలరావు, లక్ష్మణరావు, రాంబాబు ఆధ్వర్యంలో అదివారం స్థానిక సర్పంచ్ గోక మహేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు పెద్ది శ్రీనివాసరావు ద్వారా వివిధ సామగ్రిని అందజేసి ఔదర్యాన్ని చాటుకున్నారు. నాయకులు మొండేటి చిరంజీవి, సత్యనారాయణ, రమణ ఉన్నారు.

బుడగట్లపాలెంలో ఉచిత వైద్య శిబిరం



వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల: బుడగట్లపాలెంలో మెగా ఉచిత వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. శ్రీకాకుళానికి చెందిన మహాలక్ష్మి లైఫ్‌కేర్ ఆస్పత్రి ఎండీ డాక్టర్ పప్పల సౌజన్య ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరాన్ని గ్రామసర్పంచ్ అల్లుపల్లి రాంబాబు ప్రారంభించి మాట్లాడారు. వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సుమారు వందమంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్థోపెడిక్ వైద్యులు కె.హేమంత్, శివ, కె.రమణ, ఎం.లక్ష్మణ, పెంటారావు, ఆర్ఎంపీ డాక్టర్లు, గ్రామ మత్స్యకారుల సంఘం నాయకుడు సీహెచ్ శ్రీరాములు పాల్గొన్నారు.

నేడు వైద్య, రక్తదాన శిబిరాలు

గార: ఈ నెల 20వ తేదీన మండలంలోని కె.మత్స్యలేశం పంచాయతీ వాడపాలెంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పుట్టిన రోజు పురస్కరించుకుని ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ఈ మేరకు బీజేపీ మండల అధ్యక్షురాలు మైలపిల్లి లక్ష్మీజనార్దన్ తెలిపారు. కెప్టెన్ జనార్దన్ ఇంటి వద్ద ఈ శిబిరం ఉంటుందన్నారు. అలాగే రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నామని తెలిపారు.

భగత్‌సింగ్ ఆశయాలను కొనసాగిద్దాం



భగత్‌సింగ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కమిటీ ప్రతినిధులు

శ్రీకాకుళం అర్బన్: స్వాతంత్రోద్యమ నిప్పు కనిక భగత్ సింగ్ అని, ఆయన చరిత్రలో ఎప్పుడూ సజీవంగా నిలిచిపోతారని, ఆయన ఆశయాలను కొనసాగించాలని వక్తలు అన్నారు. నగరంలోని స్వాతంత్ర సమరయోధులు, సంఘ సంస్కర్తల స్మృతి వనంలో భగత్ సింగ్ జయంతిని ఆదివారం నిర్వహించారు. విగ్రహ దాతలు నేమాని వేదవతి శ్యామ్‌ప్రసాద్ బృందంతోపాటు గాంధీ మందిర్ కమిటీ ప్రతినిధులు జామి భీమశంకర్, కొంక్యాన వేణుగోపాల్, మహిబుల్లాఖాన్, వావిలపల్లి జగన్నాథం నాయుడు, జామి విద్యాధరి, జామి అనురాధ, ఊణ్ణ తీర్థ, మెట్ట అనంతం భట్లు తదితరులు భగత్ సింగ్ విగ్రహానికి నివాళులర్పించారు. భగత్ సింగ్ గొప్పతనాన్ని వివరిస్తూ అవధాన పండితులు పైడి హరనాథ రావు గేయాన్ని ఆలపించారు. ఈ కార్యక్రమంలో జేసీస్ కార్యదర్శి తమ్మినేని ఉషారాణి, నక్క శంకరరావు, గుత్తు చిన్నారావు, శాస్త్రి, సువ్వారి రాజారావు, తదితరులు పాల్గొన్నారు.

అన్నదాత అవస్థలు

- సకాలంలో అందని యూరియా
- అధిక మొత్తంలో పెట్టుబడులు



మందులను పిచికారీ చేస్తున్న రైతులు



ఒక్క బస్తా యూరియా మాత్రమే తీసుకెళ్తున్న రైతు

జి.సిగడాం: ఈ ఏడాది అన్నదాతకు అవస్థలు తప్పడం లేదు. ఒక్కపక్క రూ.వేలల్లో మదుపులు పెట్టలేక, మరోపక్క యూరియా, ఇతర ఎరువులు దొరక్క నానా కష్టాలు పడుతున్నారు. జి.సిగడాం మండలంలోని 31 గ్రామ పంచాయతీల్లో 15,954 ఎకరాల్లో రైతులు పంటలను సాగు చేస్తున్నారు. వీటిలో 9,746 ఎకరాల్లో వరి సాగు, 6,478 ఎకరాల్లో మొక్కజొన్న పంటలు పండిస్తున్నారు. అయితే రైతుకు ఆదిలోనే యూరియా కష్టం వచ్చి పడింది. పంటకు సకాలంలో ఎరువులు వేయలేక ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఈసారి వరి రైతులకు కష్టకాలం తప్పదని వాపోతున్నారు. ప్రభుత్వం సకాలంలో ఎరువులు అందించాలని కోరుతున్నారు. ప్రస్తుతం మండలంలోని 90 శాతం వరి పొలాల్లో ఉబాలు పూర్తి చేసినట్లు అధికారులు పేర్కొంటున్నారు.

మదుపులు రెట్టింపు



గడిచిన ఏడాదితో పోలిస్తే ప్రస్తుతం కూలీల రేట్లు, ఎరువుల ధరలు, ఇతర సస్య రక్షణ మదుపులు రెట్టింపు అయ్యాయి. కరువు నేపథ్యంలో చితికిపోయిన రైతును ఆదుకోవడంలో ప్రభుత్వ యంత్రాంగం నిర్లక్ష్యం వహించింది. దీంతో సాగు చేపట్టలేక, వదుకోలేక సందిగ్ధంలో పడ్డాము.

– భూపతి సురేష్‌కుమార్, చెట్టుపొదిలాం

ప్రభుత్వం ఆదుకోవాలి



రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి ప్రభుత్వం సకాలంలో రుణాలు అందజేయాలి. వీటితోపాటు వివిధ రకాలుగా రైతులకు రాయితీలు ప్రోత్సాహకాలు అందించి ఆదుకోవాలి. ఇప్పటికే అప్పులు ఊబిలో కూరుకుపోయాము. ఈ ఏడాది ఇబ్బందులు తప్పేలా లేవు.

– గేదెల నారాయణరావు, గేదెలపేట

యూరియా కొరత లేదు



మండలానికి 1,863 మెట్రిక్ టన్నులు యూరియా మంజూరు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. ఇప్పటికే 1,589 యూరియా ప్రభుత్వం సరఫరా చేసింది. వీటిని రైతులకు అందించాం. ఎక్కడైనా అర్హులైన రైతులు ఉంటే యూరియా అందేవిధంగా చర్యలు తీసుకుంటున్నాం. మండలానికి యూరియా కొరత మాత్రం లేదు.

– బెందు బాల్జీ, ఏవో, జి.సిగడాం

కార్యకర్తలకు అండగా డిజిటల్ బుక్



డిజిటల్ బుక్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే కిరణ్‌కుమార్, పార్టీ శ్రేణులు

- మాజీ ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

రణస్థలం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కోసం శ్రమిస్తున్న కార్యకర్తలకు ఆపద సమయంలో అండగా నిలిచేందుకు పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డిజిటల్ బుక్‌ను ప్రవేశపెట్టారని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ తెలిపారు. మండల కేంద్రంలోని ఎచ్చెర్ల నియోజకవర్గ పార్టీ క్యాంపు కార్యాలయంలో ఆదివారం డిజిటల్ బుక్ క్యూఆర్‌కోడ్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డిజిటల్ బుక్‌లోకి ప్రవేశించాలంటే క్యూ ఆర్ కోడ్‌తో రిజిస్ట్రేషన్ చేసుకుని లోపల వివరాలు నమోదు చేయవచ్చునని అవగాహన కల్పించారు. అన్యాయానికి గురౌతున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకుల కోసం డిజిటల్ బుక్‌ను రూపొందించినట్లు పేర్కొన్నారు. ప్రజల కోసం పోరాడుతూ కూటమి ప్రభుత్వం నుంచి వేధింపులకు గురైన కార్యకర్తలకు అండగా ఉంటామని, ఎవరికి ఏ కష్టం వచ్చిన డిజిటల్ బుక్‌లో నమోదు చేయాలని సూచించారు. మీ తరపున పార్టీ నిలబడుతుందని, అన్యాయానికి వ్యతిరేకంగా పోరాడుతుందన్నారు. కూటమి ప్రభుత్వం నుంచి అన్యాయానికి గురవుతున్నవారందరూ డిజిటల్ బుక్‌లో వివరాలు నమోదు చేసినా పర్వాలేదన్నారు. లేదా 040-49171718 నంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చున్నారు. ప్రతీ ఒక్క కార్యకర్తకు డిజిటల్ బుక్‌పై అవగాహన కల్పించాలని మండల నాయకులకు వివరించారు. కూటమి ప్రభుత్వంలో మీకు జరిగిన అన్యాయాన్ని ఫొటో రూపంలో కానీ, వీడియో రూపంలో కానీ అప్లోడ్ చేయవచ్చున్నారు. కార్యక్రమంలో నాలుగు మండలాల ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, వైస్ ఎంపీపీలు, మండల పార్టీ అధ్యక్షులు, జిల్లా, నియోజకవర్గ అనుబంధ విభాగ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వృద్ధులు కాదు పెద్దలు



వయో వృద్ధులకు సన్మానిస్తున్న స్టార్ వాకర్స్ ప్రతినిధులు

శ్రీకాకుళం అర్బన్: సమాజంలోని వృద్ధులు భావితరాలకు దిశానిర్దేశం చేసే పెద్దలని వక్తలు అన్నారు. అక్టోబర్ ఒకటో తేదీన అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా శ్రీకాకుళం డిగ్రీ కళాశాల మైదానంలో శ్రీకాకుళం స్టార్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో వయోవృద్ధులకు ఆదివారం సన్మానించారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీతలు మాట్లాడారు. సమాజంలో పెద్దలను గౌరవించాలన్నారు. ప్రభుత్వ పరంగా వయోవృద్ధులకు ప్రత్యేక సంక్షేమ కార్యక్రమాలను తీసుకురావాలన్నారు. యునియన్ బ్యాంక్ రీజినల్ మేనేజర్ పైడి రాజా మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వయోవృద్ధులకు అనేక సంక్షేమ కార్యక్రమాలను చేపడుతున్నాయన్నారు. బ్యాంకులు కూడా వడ్డీ రాయితీలు అందజేస్తున్నాయన్నారు. వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థ కో-ఆర్డినేటర్ ఎస్.జోగినాయుడు, స్టార్ వాకర్స్ క్లబ్ వ్యవస్థాపకుడు గేదెల ఇందిరాప్రసాద్, స్టార్ వాకర్స్ క్లబ్ మెంబర్లు వావిలపల్లి జగన్నాథ నాయుడు, అంకడాల తవిటన్న, గేదెల లక్ష్మి, గుడ్ల జగ్గారావు, జి.ఉమామహేశ్వరరావు, డాక్టర్ జి.ఎస్.రావు, వై.మోహన్, తదితరులు పాల్గొన్నారు.

మాజీ సీఎం జగన్‌ను విమర్శించే హక్కు బాలకృష్ణకు లేదు

- మాజీ ఎమ్మెల్యే కిరణ్‌కుమార్



మాట్లాడుతున్న కిరణ్‌కుమార్

రణస్థలం: వైఎస్ఆర్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించే నైతిక హక్కు సినీనటుడు బాలకృష్ణకు లేదని మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. బాలకృష్ణకు మతిభ్రమించి మాట్లాడుతున్నారన్నారు. మండల కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం మాట్లాడుతూ.. అసెంబ్లీలో జగన్‌నుద్దేశించి బాలకృష్ణ చేసిన వ్యాఖ్యలను ఖండించారు. తుపాకీ కాల్పుల్లో జైలు పాలవాల్సిన బాలకృష్ణకు భిక్ష పెట్టిన ఘనత ఆనాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అని గుర్తు చేశారు. అలాగే జగన్ సీఎంగా ఉన్నప్పుడు బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రికి కోట్ల రూపాయలు సీఎం సహాయనిధి మంజూరు చేసిన విషయం మరిచిపోయి బాలకృష్ణ మాట్లాడుతున్నారన్నారు. బాలకృష్ణ తక్షణమే జగన్‌కు క్షమాపణ చెప్పాలని పార్టీ తరఫున డిమాండ్ చేస్తున్నామని కిరణ్ అన్నారు.

భర్త ఆచూకీ తెలపండి..



దుర్గాప్రసాద్

శ్రీకాకుళం క్రైమ్: తన భర్త ఈ నెల 14వ తేదీన బయటకు వెళ్లి ఇప్పటివరకు ఇంటికి చేరలేదని ఆదివారం ఓ వివాహిత ఫిర్యాదు చేసినట్లు రెండో పట్టణ సీఐ పి.ఈశ్వర రావు పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని చౌదరి సత్యనారాయణ కాలనీకి చెందిన బత్తుల దుర్గాప్రసాద్‌తో 2018లో వివాహమైనట్లు శ్యామల పేర్కొంది. తన తాపీ పని చేస్తాడన్నారు. తనకు కుమారుడు జోషి, కుమార్తె మల్లీశ్వరి ఉన్నారన్నారు. ఈ నెల 14వ తేదీ ఉదయం తాపీ పనికని బయటకు వెళ్లిన భర్త పది రోజుల తర్వాత ఫోన్ చేసి తిరుపతిలో ఉన్నానని చెప్పాడని, ఆ తర్వాత రెండుసార్లు వాట్సాప్ కాల్‌చేసి బాగానే ఉన్నట్లు చెప్పాడన్నారు. ప్రస్తుతం ఫోన్ స్విచ్ఛాఫ్ కావడంతో పోలీసులను ఆశ్రయించానన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

షాపు ఖాళీ చేయలేదని దౌర్జన్యం

శ్రీకాకుళం క్రైమ్ : తమకు అద్దెకిచ్చిన షాపు ఖాళీ చేయలేదని యజమాని కుటుంబీకులు దౌర్జన్యం చేశారని మహలక్ష్మినగర్ కాలనీకి చెందిన మనోజ్‌కుమార్ అరోరా అనే వ్యక్తి ఒకటో పట్టణ పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశారు. పదినెలల క్రితం షాపు ఖాళీ చేయమని చెప్పినా కొంత సమయం ఇవ్వాలని మనోజ్ కోరడం, అయినప్పటికీ వారు ఒత్తిడి చేయడంతో గతంలోనే కోర్టులో దావా వేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. అయినప్పటికీ ఈ నెల 25న సానా కవిత, బుచ్చిబాబు, సానా గీతలు షాపులో ప్రవేశించి రూ.30 వేలు విలువైన మెటీరియల్ బయటకు తోసేసి తనపైన, తన భార్య కాజోల్ అరోరాపైన దౌర్జన్యానికి దిగి దాడికి పాల్పడ్డారన్నారు. మనోజ్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు న మోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ హరికృష్ణ తెలిపారు.

చెరువును తలపిస్తున్న సర్వీస్ రోడ్లు

ఎచ్చెర్ల: జాతీయ రహదారులను ఆనుకొని ఏర్పాటు చేసిన సర్వీసురోడ్లు చెరువులను తలపిస్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు సర్వీసు రోడ్లపై నీరు నిలిచిపోవడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న సభ్యులు

శ్రీకాకుళం రూరల్: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ అంబటి నిర్మల ఆధ్వర్యంలో, ఎంపీడీఓ ప్రకాశ్ రావు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. గ్రామాల్లో వ్యవసాయ సమాచారం సేకరించేందుకు అగ్రికల్చరర్ అసిస్టెంట్‌ల కొరత ఉందని ఏఓ పి.నవీన్‌కుమార్ తెలిపారు. మండలంలో 16,333 ఎకరాలకు 633 మెట్రిక్ టన్నుల ఎరువులు వచ్చాయన్నారు. ఇందులో సింగుపురం పంచాయతీకి 160 మెట్రిక్ టన్నులు అవసరం కాగా.. 87 మెట్రిక్ టన్నులు మాత్రమే అందించామన్నారు. మరో 30 మెట్రిక్ టన్నులు యూరియాతోపాటు పోటాష్ కావాలని ప్రతిపాదనలు పెట్టామన్నారు. విద్యుత్‌శాఖ అధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. మండంలో పీఎం సూర్య ఘర్‌ను సబ్సిడీ ద్వారా అందిస్తున్నామన్నారు. జల్ జీవన్ మిషన్ పనులు సింగుపురం పంచాయతీ కిష్టప్పపేటలో జరగడం లేదని ఎంపీటీసీ సభ్యుడు బగ్గు అప్పారావు లేవనెత్తారు. టెండర్లు పూర్తయినప్పటికీ కనీసం ట్యాంక్ తవ్వేందుకు గ్రామంలో స్థల పరిశీలన జరగలేదన్నారు. పలు శాఖలకు చెందిన అభివృద్ధిని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

రోటరీ సేవలు మరింత విస్తృతం



విశిష్ట పురస్కార గ్రహీతలతో రోటరీ క్లబ్ ప్రతినిధులు

శ్రీకాకుళం అర్బన్: సమాజసేవలో ప్రపంచ వ్యాప్తంగా రోటరీ అంతర్జాతీయ సంస్థ సేవలు విస్తృతంగా జరుగుతున్నాయని రోటరీ డిస్ట్రిక్ట్ 3020 గవర్నర్ వై.కళ్యాణ్ చక్రవర్తి అన్నారు. రోటరీ గవర్నర్ అధికారిక పర్యటన సందర్భంగా శ్రీకాకుళం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో శ్రీకాకుళంలోని వారాహి గ్రాండ్‌లో ఏర్పాటు చేసిన సమావేశం, రోటరీ ఉత్తమసేవ పురస్కారాలు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచ శాంతి, విద్య, వైద్యం, పర్యావరణ పరిరక్షణ, మంచినీరు- పరిశుభ్రత, మాతా-శిశు సంరక్షణ, వైద్యం వంటి పలు అంశాలపై సేవలందిస్తుందన్నారు. క్లబ్ అధ్యక్షుడు బరాటం శ్రీనివాస మాట్లాడుతూ.. క్లబ్ చేస్తున్న సేవా కార్యక్రమాల వివరాలు తెలియజేశారు. అనంతరం ఉత్తమ సమాజ సేవలు అందిస్తున్న వారికి రోటరీ పురస్కారాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సహాయ గవర్నర్ సనపల నర్సింగరావు, ప్రాంతీయ పబ్లిక్ ఇమేజ్ కార్యదర్శి డి.శివశంకర్, క్లబ్ కార్యదర్శి కిల్లాన శ్రీనివాసరావు, ఎం.ఆర్.కె.దాస్, ఎస్.వి.ఎస్.ఎన్.వర్మ, ఎస్.కె.గౌరీశంకర్, మంత్రి వెంకటస్వామి, తదితరులు పాల్గొన్నారు.

రోటరీ విశిష్ట పురస్కారాలు..

పర్యావరణ పరిరక్షణకు కృషి చేసిన జామి చంద్రశేఖర్, విద్యాభివృద్ధి కోసం కృషిచేసిన డి.సద్గుణ బాబు, ఆరోగ్య పరిరక్షణకు కృషిచేసిన యోగా గురువు కొల్లి వెంకటరావు, విశిష్ట సంఘసేవకు మురిపాల రామారావు, రోటరీ ఉత్తమ సేవలకు డాక్టర్ మంత్రి వెంకటస్వామికి రోటరీ విశిష్ట పురస్కారాలను అందజేశారు.

అభివృద్ధిని అడ్డుకునేది మీరే కదా?

- ఎంపీపీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర రైతు విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ గొండు రఘురామ్



గొండు రఘురామ్

గార: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అంపోలులో అభివృద్ధిని అడ్డుకునేందుకు హైకోర్టులో కేసు వేసి, ప్రజలను తప్పుదోవపట్టించిన మాజీ సర్పంచ్ గొండు వెంకటరమణమూర్తి ద్వంద్వవైఖరి అందరికీ తెలుసని ఎంపీపీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర రైతు విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ గొండు రఘురామ్ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ అంపోలు గ్రామ మధ్యలోని బ్రహ్మ గుండం చెరువులో ఆక్రమణలు పేరిట 2022లో కోర్టుకు వెళ్లి సచివాలయం, రైతు భరోసా కేంద్రం నిర్మాణాలు జరగకుండా అడ్డుకోవడం నిజం కాదా అని ప్రశ్నించారు. అప్పటికే 600 మంది విద్యార్థులుండే జిల్లా పరిషత్ హైస్కూల్, పంచాయతీ కార్యాలయం, ప్రైమరీ స్కూల్, 270 గృహాలు, పశువుల ఆసుపత్రి, ఆరోగ్య ఉపకేంద్రం ఉన్నాయని, పంచాయతీ సర్పంచ్‌గా పనిచేసిన మీకు తెలిసే ఫిల్ వేయడం ప్రజలందరూ అందరికీ తెలుసన్నారు. అసెంబ్లీ వేదికగా ఎమ్మెల్యే గొండు శంకర్ అంపోలు పరిస్థితిని అసెంబ్లీలో ప్రస్తావించడం, మీరు మీడియాలో అభినందనలు తెలపడంపై మతలబు ఏమిటో ప్రజలకు చెప్పాలన్నారు. కేవలం గత ప్రభుత్వంలో సచివాలయ వ్యవస్థ ద్వారా జరుగుతున్న అభివృద్ధి చూసి ఓర్వలేకనే ఇటువంటి చర్యలకు పాల్పడటం వాస్తవమా కాదా అని ప్రశ్నించారు. ప్రజలు అన్ని విషయాలు గమనిస్తున్నారని సరైన సమయంలో తగిన బుద్ధి చెబుతారన్నారు.

బాలకృష్ణ వ్యాఖ్యలు సరికాదు



మాట్లాడుతున్న సాయికుమార్

రణస్థలం: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సైకో అంటూ సినీనటుడు బాలకృష్ణ అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఎచ్చెర్ల నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు పిన్నింటి సాయికుమార్ తెలిపారు. రణస్థలం మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. ఇటీవల అసెంబ్లీ సమావేశంలో బాలకృష్ణ చేసిన అభ్యంతర వ్యాఖ్యలు తన మానసిక స్థితిని తెలియజేస్తుందని అన్నారు. వారి వ్యవహార శైలి, గత చరిత్రలో ప్రవర్తన తెలుగు ప్రజలకు తెలుసని అన్నారు. ఇటువంటి మాటలను స్పీకర్ అసెంబ్లీ రికార్డుల నుండి వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూసి భావి ప్రజా ప్రతినిధులకు మార్గదర్శకంగా ఉండాలని అన్నారు. రణస్థలం జెడ్పీటీసీ సభ్యుడు టొంపల సీతారాం, మండల నాయకులు మహంతి పెదరామినాయుడు, మహంతి చినరామినాయుడు, పిన్నింటి లక్ష్మంనాయుడు, మింది శ్రీనివాస్ రెడ్డి ఉన్నారు.

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, సినీ నటుడు చిరంజీవిపై హిందూపురం ఎమ్మెల్యే, సినీ నటుడు బాలకృష్ణ అసెంబ్లీలో అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని వైఎస్సార్‌సీపీ కాళింగకుల రాష్ట్ర అధ్యక్షుడు దుంపల లక్ష్మణరావు అన్నారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. బాలకృష్ణ తన ఇంట్లో కాల్పులు జరిపినప్పుడు దివంగత వైఎస్సార్ మానవతా దృక్పథంతో కాపాడిన సంగతి మరిచిపోయి, ఇష్టం వచ్చినట్లు మాట్లాడం సరికాదన్నారు. శాసన సభలో చిరంజీవి తమ్ముడు, డిప్యూటి సీఎం పవన్ కల్యాణ్ ఉన్నా.. బాలకృష్ణ మాటల్ని ఖండించకపోవడం దారుణమన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సినీ పరిశ్రమ సమస్యలు పరిష్కరించింది వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని గుర్తు చేశారు. బాలకృష్ణ ఏ రకమైన సైకో ప్రజలందరికీ తెలుసున్నారు. తక్షణమే బాలకృష్ణ బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేకుంటే అందుకు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.



దుంపల లక్ష్మణరావు

సాయినామంతో హోరెత్తిన ఆనందపురం



ఆనందపురంలో బాబాచిత్ర పటాన్ని ఊరేగిస్తున్న చేస్తున్న భక్తులు

జి.సిగడాం: ఆనందపురం గ్రామంలో షిర్డీసాయి బాబా జన్మదిన వేడుకలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. భక్తుల సాయినామ స్మరణతో ఈ ప్రాంతం హోరెత్తింది. పూజ్య గురువులు అమ్ముల సాంబశివరావు ఆధ్వర్యంలో ఆలయ నిర్మాత మక్క వెంకటసాయి సమక్షంలో నిర్వహించిన వేడుకల్లో రణస్థలం, లావేరు, జి.సిగడాం, చీపురుపల్లి, రాజాం, పొందూరు, ఎచ్చెర్ల మండలాలకు చెందిన సాయిస్వాములు పాల్గొన్నారు. చంద్రయ్యపేట, ఎందువ, గెడ్డకంచరాం, జి.సిగడాం, పెంట, దేవరవలస, నడిమివలస, గ్రామాల్లో ఉన్న బాబా ఆలయాల్లో కూడా ప్రత్యేక పూజలు చేసి కేక్ కటింగ్ చేశారు. కాగా బాబా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు.

దుర్గాదేవికి ప్రత్యేక పూజలు



జి.సిగడాం: పెంట గ్రామంలో గాజుల అలంకరణలో దుర్గాదేవి



గార: కుంకుమ పూజల్లో పాల్గొన్న భక్తులు



శ్రీకాకుళం కల్చరల్: నక్కవీధిలో మహాలక్ష్మీగా ఉమాదేవి



శ్రీకాకుళం కల్చరల్: రామమందిరంలో దుర్గాదేవికి పసుపుకొమ్ములతో పూజలు



శ్రీకాకుళం కల్చరల్: మొండేటివీధిలో మహాచండీ మాతగా లలితాదేవి



శ్రీకాకుళం కల్చరల్: పుణ్యపువీధిలో చండీ హోమం

దేవి నవరాత్రులు వైభవంగా కొనసాగుతున్నాయి. అమ్మవారి దర్శనానికి భక్తులు పోటెత్తుతున్నారు. ఏడో రోజైన ఆదివారం అమ్మవారు వివిధ అలంకరణలో దర్శనం ఇవ్వగా.. భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కుంకుమ పూజల్లో మహిళలు అధికంగా పాల్గొన్నారు.

–సాక్షి నెట్‌వర్క్